

అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీ తేదీలో మార్పు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని కోడిరామ్మూర్తి స్టేడియంలో అండర్-14, 16 బాలికలకు ఈనెల 23న జరగాల్సిన అస్మిత జిల్లా స్థాయి అథ్లెటిక్స్ లీగ్ పోటీలు ఈనెల 28వ తేదీకి మార్పు చేశామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.సాంబమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖేలో ఇండియా, అథ్లెటిక్స్ ఫెడరేషన్ సౌజన్యంతో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆదేశాల మేరకు మార్పు చేశామన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రంతో పాల్గొని ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.మాధవ రావు వద్ద రిపోర్టు చేయాలని కోరారు.



నాగావళికి దీపకాంతులు

● భక్తిశ్రద్ధలతో పోలిపాడ్యమి

శ్రీకాకుళం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పోలిపాడ్యమిని జిల్లావాసులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కార్తీకమాసం ముగింపు కావడంతో శుక్రవారం వేకువ జామున అధిక సంఖ్యలో భక్తులు శ్రీకాకుళంలోని ఉమారుద్ర కోటేశ్వరాలయం చెంతన ఉన్న నాగావళి నదీ తీరానికి చేరుకున్నారు. అరటి తెప్పల్లో దీపాలు వెలిగించి.. నదిలో విడిచిపెట్టారు. దీంతో నాగావళి నది దీపకాంతులతో కళకళలాడింది. అనంతరం భక్తులు ఉమారుద్ర కోటేశ్వరుడ్ని దర్శించుకుని పూజలు చేశారు. జిల్లావ్యాప్తంగా పలు శివాయాలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది.



శ్రీకాకుళం : నాగావళి నదిలో దీపారాధన చేస్తున్న భక్తులు

మత్స్యకారులకు స్వర్ణయుగం

● యాభై ఏళ్లకే పింఛన్ ఇచ్చిన ఘనత ప్రభుత్వానిది
● ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే సంక్షేమం
● పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తాం
● మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలోనే మత్స్యకారులకు స్వర్ణయుగం సాధ్యమైందని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం శ్రీకాకుళంలోని అంబేడ్కర్ ఆడిటోరియలో ప్రపంచ మత్స్య దినోత్సవం నిర్వహించారు. మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ 'మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్నివిధాలా కట్టుబడి ఉంది. దేశంలో ఏ ప్రాంతంలోనైనా ఉపాధి కోసం వెళ్లేవారిలో శ్రీకాకుళం మత్స్యకారులు ఉంటున్నారు. వారి తలరాతను మార్చే దిశగా మా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రవేశ పెడుతోంది. మత్స్యకారులకు యాభై ఏళ్లకే పింఛన్ ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదే. హుద్‌హుద్, తితలీ, మొంథా తుఫాన్ వంటి విపత్తుల్లో మా ప్రభుత్వమే అండగా నిలిచిందని తెలిపారు. గత ప్రభుత్వం ఫిష్ ఆంధ్రా పేరుతో దోపిడీ చేసిందని ఆరోపించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను అభినందిస్తూ.. తీర ప్రాంతాల్లో రోడ్లు, సౌర వీధిలైట్లు ఆయన కృషి ఫలితమేనని తెలిపారు. మూలపేటలో పోర్టు త్వరలోనే పూర్తి చేస్తామని వెల్లడించారు. త్వరలో రెండు కొత్త హార్బర్లు, కొత్త జెట్టీలు తీసుకువస్తున్నామని తెలిపారు. రాబోయే (మిగతా 6వ పేజీలో..)



మత్స్యకారులకు చెక్కును అందజేస్తున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పక్కన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు తదితరులు

టెక్ శంకర్ అమర్ రహే



టెక్ శంకర్ (ఫైల్)

● బాతుపురంలో మావోయిస్టు నేత జోగారావు అంత్యక్రియలు
● ఉద్దానం ప్రజలు, విప్లవ సంఘాల ఘననివాళి



జోగారావు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు



జోగారావు అంతిమయాత్రలో పాల్గొన్న ఉద్దానం ప్రజలు, విప్లవాభిమానులు

పలాస/వజ్రపుకొత్తూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వజ్రపుకొత్తూరు మండలం బాతుపురంలో విప్లవ నినాదాలు హోరెత్తాయి. 'టెక్ శంకర్ అమర్ రహే' అంటూ మావోయిస్టు నేత మెట్టూరు జోగారావుకు విప్లవ సంఘాలు, అమరుల బంధుమిత్రుల కమిటీ, ప్రజా కళాకారులు, ఉద్దానం ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. పోలీసుల ఆంక్షల నడుమ అంత్యక్రియలు పూర్తిచేశారు. అల్లూరిసీతారామరాజు జిల్లా మారేడుమిల్లిలో బుధవారం పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు నేత మెట్టూరు జోగారావు అలియాస్ టెక్ శంకర్ మృతి చెందిన విషయం తెలిసిందే. రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం ఆయన మృతదేహాన్ని గురువారం రాత్రి బంధువులకు అప్పగించారు. అంబులెన్స్‌లో జోగారావు మృతదేహాన్ని శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆయన స్వగ్రామమైన బాతుపురం తీసుకువచ్చారు. అప్పటికే ఆయన ఇంటివద్ద విప్లవాభిమానులు, స్థానికులు, ఉద్దానం ప్రజలు పెద్దఎత్తున చేరుకున్నారు. పోలీసులు వారిని వారిస్తూ గంట మాత్రమే కార్యక్రమం నిర్వహించాలని, ఊరేగింపులు.. ఎర్రజెండాలు లేకుండా అంత్యక్రియలు చేపట్టాలని సూచించారు. పెద్ద ఎత్తున ప్రజలు రావడంతో రెండు గంటలపాటు మృతదేహాన్ని ఆయన ఇంటి వద్ద ఉంచాల్సి వచ్చింది. జోగారావుకు క్యూ పద్ధతిన ప్రజలు నివాళులర్పించారు. అరుణోదయ కళాకారుల బృందం విప్లవగీతాలు ఆలపిస్తూ జోగారావు విప్లవ ప్రస్థానాన్ని వివరిస్తూ ప్రసంగించారు. అనంతరం అంతియమాత్రకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో జోగారావు మృతదేహం ఊరేగింపునకు అనుమతి లేదని, కేవలం అంత్యక్రియలు నిర్వహించుకోవాలని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతి.. బంధువులు, అమరుల బంధుమిత్రుల కమిటీకి మరోసారి స్పష్టం చేశారు. దీంతో ఇరువురి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. బంధుమిత్రుల కమిటీ సభ్యులు పోలీసుల వైఖరికి నిరసనగా రోడ్డుపై బైఠాయించి (మిగతా 6వ పేజీలో..)

ఉద్దానం గుట్టు విప్పేందుకు..

● కిడ్నీ సమస్యలకు కారణాలపై అధ్యయనానికి ప్రాజెక్టు మంజూరు
● క్రానిక్ కిడ్నీ డీసీజ్ ఆఫ్ అన్‌నోన్ ఇథియాలజీ ఇన్ శ్రీకాకుళం జిల్లా పేరుతో..
● మూడేళ్లపాటు అధ్యయనం చేయనున్న డాక్టర్ రవిరాజు నేతృత్వంలోని బృందం

6లో

విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో సాంకేతిక సమస్య

● పొందూరులో రెండు గంటలు నిలిచిన రైలు ● ప్రయాణికులకు ఇబ్బందులు



పొందూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో సాంకేతిక సమస్య తలెత్తింది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు రైలు పొందూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. కొద్దిసేపటి తర్వాత తిరిగి బయలుదేరే సమయంలో సాంకేతిక సమస్య కారణంగా ముందుకు కదలలేదు. అలారం చైన్‌పుల్లింగ్ సమస్య కారణంగా రైలు సుమారు రెండున్నర గంటలపాటు స్టేషన్‌లో నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మరో వైపు దిబ్రుగడ్ నుంచి కన్యాకుమారి వెళ్లే వివేక్ ఎక్స్‌ప్రెస్, శ్రీకాకుళం నుంచి బెంగళూరు వెళ్లే స్పెషల్ ట్రైన్, ఈఎంయూ రైలు కూడా ఆమదాలవలస(శ్రీకాకుళం రోడ్డు) స్టేషన్ సమీపంలో నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు. విజయనగరం నుంచి సాంకేతిక సిబ్బంది చేరుకుని సమస్యను పరిష్కరించారు. 4.30 గంటల సమయంలో రైలు తిరిగి బయలుదేరినట్లు స్టేషన్ మాస్టర్ జేవీ ఉమామహేశ్వరరావు తెలిపారు.

ఒడిశా నుంచి కర్ణాటక

● గంజాయి రవాణా.. ఇద్దరి అరెస్ట్

ఇచ్ఛాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి కర్ణాటక రాష్ట్రానికి గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఇచ్ఛాపురం సీఐ మీసాల చిన్నమనాయుడు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుమండి గ్రామానికి చెందిన బాహూజీ సుబుద్ది బరంపురంలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అక్కడ గంజాయి వ్యాపారం చేసే ఖందమాల్ జిల్లా (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న సీఐ చిన్నమనాయుడు, పోలీసుల అదుపులో గంజాయి నిందితులు

అర్హులకు పింఛన్లు మంజూరు చేయండి

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ 6లో

ఎట్టకేలకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం

7లో

● సర్వేనెంబర్ 163కు క్లియరెన్స్

పాసులైతే ఇచ్చారు.. బస్సులేవీ?

● ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు విద్యార్థుల అవస్థలు 8లో

దిగొచ్చిన వెండి



● తగ్గుతున్న ధరలు ● నెలలో కిలోపై రూ.30 వేల వరకు తగ్గిన వైనం
● బంగారం కూడా వారంలో 10 గ్రాములపై రూ.5వేలు తగ్గింపు ● డీలా పడుతున్న మదుపరులు

● గత నెల అక్షయ తృతీయనాడు నరసన్నపేటకు చెందిన ఒక ఉపాధ్యాయుడు కిలో వెండి రూ.1.70 లక్షలకు కొనుగోలు చేశారు. మూడు రోజుల తర్వాత కిలో వెండి రూ.1.90 లక్షలకు చేరడంతో తనకు భవిష్యత్‌లో మరింత లాభం వస్తుందని ఆనందపడ్డారు. కానీ, తర్వాత వెండి ధర క్రమేపీ తగ్గుతూ.. ప్రస్తుతం కిలో రూ.1.60 లక్షలకు దిగి రావడంతో దిగులు చెందుతున్నారు.

● శ్రీకాకుళం నగరానికి చెందిన ఒక ఉద్యోగి దాచుకున్న సొమ్మునంతా గత నెలలో వెండి మీద పెట్టుబడి పెట్టారు. కిలో రూ.1.65 లక్షలు చొప్పున మూడు కేజీల వెండి కొనుగోలు చేశారు. తీరా రోజురోజుకు వెండి ధరలు పతనం కావడంతో ఇంట్లో ఉంచుకోలేక.. అమ్ములేక సతమతమవుతున్నారు. భవిష్యత్‌తో వెండి ధరలు మరింత తగ్గే అవకాశం ఉందని తెలిసి గగ్గోలు చెందుతున్నారు.



నరసన్నపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి)

బంగారం, వెండి ధరలు గత వారం రోజులుగా తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో ఆభరణాలు కొనుగోలు చేద్దామనుకున్న వినియోగదారులు ఊరట చెందగా.. ఇప్పటికే వాటిపై పెట్టుబడి పెట్టిన మదుపరులు మాత్రం డీలా పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది బంగారం, వెండి ధరలు పెరిగాయి. భవిష్యత్‌లో మరింత ధరలు పెరుగుతాయనే ఉద్దేశంతో ఉద్యోగులు, వ్యాపారులు బంగారం, వెండి మీద పెట్టుబడి పెట్టారు. రియల్‌ఎస్టేట్ రంగం డీలా పడడం, స్టాక్‌మార్కెట్ ఒడిదొడుకుల నేపథ్యంలో మదుపరులు బంగారం, వెండి కొనుగోలుపై దృష్టి సారించారు. ఈ క్రమంలో జిల్లాలో గత నెలలో సుమారు రూ.200కోట్ల వరకు వెండి, రూ.100 కోట్ల మేర బంగారంపై పెట్టుబడి పెట్టారు. శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస, పాతపట్నం, టెక్కలి, ఆమదాలవలస, సోంపేట తదితర పట్టణాల్లో హోల్‌సేల్ వ్యాపారుల వద్ద ప్యూర్ వెండి, బంగారం బిస్కెట్లు, బాండ్లు కొనుగోలు చేశారు. కాగా 15 రోజులుగా వెండి ధర తగ్గుతోంది. దీపావళి నాటికి కిలో వెండి రూ.1.90 లక్షలు ఉండగా, శుక్రవారం నాటికి రూ.1.60 లక్షలకు పడిపోయింది. నెల రోజుల వ్యవధిలోనే కిలోపై రూ.30వేలు తగ్గగా.. భవిష్యత్‌లో మరింత తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో మదుపరులు ఆందోళన చెందుతున్నారు.

● బంగారం ధర కూడా గత పదిహేను రోజుల్లో 10 గ్రాములకు రూ.5వేల వరకు తగ్గింది. దీపావళి నాటికి పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1.32 లక్షలు ఉండగా, ప్రస్తుతం రూ.1.26 లక్షలకు దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ఔన్స్ ధరలు తగ్గుముఖం పట్టాయి. డాలర్ మారకం విలువ పెరిగింది. దీంతో బంగారం, వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయని బులియన్ వర్గాలు చెబుతున్నారు. మరోవైపు యూఎస్‌ఏలో ఫెడరల్ బ్యాంకు వడ్డీ ధర తగ్గిస్తుందని ముందుగా భావించడంతో బంగారం, వెండిపై భారీగా మదుపరులు పెట్టుబడి పెట్టారు. అయితే ఇటీవల ఫెడరల్ బ్యాంకు (మిగతా 6వ పేజీలో..)

రైతులపై కోతల భారం

● పొలాల్లోనే వరి పంట
● కూలీల దొరక్క ఇబ్బందులు
● ఖర్చులు పెరుగుతున్నాయని అన్నదాతల ఆవేదన

టెక్కలి రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వరి పంట కోతల వేళ.. అన్నదాతలకు కూలీల కొరత వెంటాడుతోంది. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో చాలాచోట్ల వరి పంట ముంపునకు గురై రైతులకు నష్టం వాటిల్లింది. మిగిలిన పంటను కాపాడుకునేందుకు రైతులు నానా కష్టాలు పడుతున్నారు. వరి పంట కోత దశకు చేరుకోగా.. వర్షపునీరు కారణంగా పొలాల్లోకి యంత్రాలు వెళ్లేందుకు వీలుపడడం లేదు. పంట కోత కోసే కూలీలు దొరకడం లేదు. దీంతో ధాన్యం గింజలు పొలాల్లోనే రాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిమాండ్ నేపథ్యంలో కూలి పెరిగిందని, ఆ భారం తమపై పడి మరింత నష్టపోతున్నామని వాపోతున్నారు.

● జిల్లాలో ఈ ఏడాది 3.89 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. 6.50లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ జరుగుతుందని అధికారులు అంచనా వేశారు. కాగా వరి పంట కోత కోసేందుకు కూలీలు దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొరత కారణంగా (మిగతా 6వ పేజీలో..)



జగన్నాథపురంలో వరిపంట కుప్పలు వేస్తున్న రైతులు

ఘనంగా పోలి పాడ్యమి



కాశీబుగ్గ: సత్యసాయి మందిరంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

- నాగావళి నదీతీరాన భక్తుల సందడి

పోలి పాడ్యమి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. జిల్లా అంతటా నాగావళి, వంశధార, బహుదా నదీతీరాల వద్ద భక్తుల సందడి చేశారు. తెల్ల వారుజామునుంచే భక్తులు దీపాలను వెలిగించి నీటిలో అరటి పువ్వు లతో, బొద్దెలతో విడిచి పెట్టారు. అనంతరం స్థానిక దేవాలయాలను సందర్శించి మొక్కులు చెల్లించారు. శ్రీకాకుళంలో నగరంలో నాగావళి నదీతీరంలో వేలాది మంది మహిళలు.. దీపాల పట్టుకుని నీటిలో విడిచిపెట్టారు.

-ఆంధ్రజ్యోతి బృందం



శ్రీకాకుళం : నాగావళి నదిలో దీపారాధన చేస్తున్న భక్తులు



అరసవల్లి ఇంద్రపుష్కరిణిలో దీపారాధన



నరసన్నపేట: బొడ్డవలస సత్యసాయి మందిరంలో సామూహిక వ్రతాలు



పాతపట్నం : షిరిడీగిరిపై సప్తాహ పూర్ణాహుతి నిర్వహిస్తున్న భక్త బృందం



జలుమూరు : శ్రీముఖలింగం ఆలయంలో శివస్వాముల సందడి





శ్రీకాకుళం : సంతోషిమాతకి పూజలు, క్యూలైన్లలో భక్తులు



టెక్కలి: అలంకరణలో రామలింగేశ్వరస్వామి..



నరసన్నపేట: నీలకంఠశ్వర స్వామి ఆలయంలో..

దిగొచ్చిన వెండి

(ఐదో పేజీ తరువాయి)

వడ్డీ రేట్లు తగ్గించనట్టు ప్రకటించింది. దీంతో వెండి, బంగారం ధరలు తగ్గుదలకు ఇదొక కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

- మదుపరులు తగ్గుతున్న ధరలను చూసి.. తమ వద్ద ఉన్న బంగారం, వెండి విక్రయించేందుకు షాపుల వద్దకు పరుగులు తీస్తున్నారు. అయితే అంత మొత్తంలో డబ్బులు ఇప్పుడు ఇవ్వలేమని.. కొద్ది రోజులు సమయం కావాలని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో కొందరు గత్యంతరం లేక విక్రయిస్తుండగా.. మరికొందరు మాత్రం భవిష్యత్‌లో వాటి ధర పెరుగుతుందనే ఆశతో ఉన్నారు.

ఊహించలేదు..

బంగారం, వెండి ధరలు తగ్గుతాయని ఊహించలేదు. భవిష్యత్‌లో పిల్లల చదువు కోసం వెండి మీద పెట్టుబడి పెట్టాం. ఒక్కసారిగా ధరలు తగ్గుతున్నాయి. నష్టమో.. లాభమో కొంత వెండి విక్రయించి.. మరికొంత భవిష్యత్ కోసం దాచుకుంటున్నాం. బంగారం ధరలు కూడా తగ్గుముఖం పట్టడం కొంతవరకు పెట్టుబడుదారులకు నష్టమే.

- వి.రామారావు, ఉపాధ్యాయుడు, నరసన్నపేట

వ్యాపారాలు పెరుగుతున్నాయి..

వెండి ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. దీంతో కొందరు భవిష్యత్ అవసరాల కోసం కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో వ్యాపారాలు పెరుగుతున్నాయి. బంగారం ధర ఒక తగ్గుతోంది. మరో రోజు పెరుగుతోంది. గత రెండు వారాల్లో బంగారం ధర 10 గ్రాములకు రూ.5వేల వరకు తగ్గింది. వెండి కిలోకు రూ.30వేల వరకు తగ్గింది.

- నానాజీ గాడ్డె, బంగారం వ్యాపారి, నరసన్నపేట

టెక్ శంకర్ అమర్‌రహే

(ఐదో పేజీ తరువాయి)



పోలీసుల తీరుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించిన అమరుల బంధుమిత్రుల కమిటీ సభ్యురాలు పి.అరుణ

ఆందోళన చేశారు. అనంతరం కుటుంబ సభ్యుల విన్నపం మేరకు ఊరేగింపును ముందుగానే తీసుకువెళ్లారు. అనంతరం జోగారావు మృతదేహాన్ని ప్రత్యేక రథంపై బాతుపురంలోని శ్మశానవాటికకు తరలించారు. మృతదేహానికి జోగారావు సోదరుడు మధుసూధన్ నిప్పంటించి అంత్యక్రియలు పూర్తిచేశారు. ఇదిలా ఉండగా బాతుపురంలో పోలీసులు అడుగడుగునా నిఘా ఏర్పాటు చేశారు. డ్రోన్‌తో కూడా పర్యవేక్షించారు. జోగారావు అంత్యక్రియలు పూర్తయ్యే వరకూ గ్రామంలోనే మకాం వేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నారు.

ఇల్లు విడిచిన తర్వాత ఒకసారే చూశాను



1988 సంవత్సరంలో ఇల్లు విడిచి జోగారావు అడవిబాట పట్టాడు. ఒకమారు పోలీసులకు పట్టుబడడంతో జైలుజీవితాన్ని గడిపాడు. ఆ సమయంలో కలిశాను. మళ్లీ ప్రస్తుతం ఆయన మృతదేహం చూస్తున్నాను. ఆయన ఉన్నాడనే ధైర్యం ఉండేది. ప్రస్తుతం అది లేదు.

-మెట్టూరు మధు, జోగారావు సోదరుడు

సంపదను పెత్తందారులకు అప్పగించడానికే ఎన్‌కౌంటర్లు



అడవిలో ఉన్న విలువైన ఖనిజ సంపదను పెత్తందారులకు అప్పగించడానికి ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగమే ఈ ఎన్‌కౌంటర్లు. దీనివల్ల ఎవరికి ప్రయోజనమో ప్రజలే ఆలోచించాలి. హిడ్మా, శంకర్ పాశవిక ఎన్‌కౌంటర్లు తీవ్రంగా ఖండిస్తున్నాం. మృతదేహాలు అప్పగించడానికి కొత్తగా డీఎన్ఏ పరీక్షల పేరుతో ఇబ్బందులకు గురిచేయడం తగదు.

-బి.అంజమ్మ, రాష్ట్ర అమరుల బంధుమిత్రుల కమిటీ అధ్యక్షురాలు

పోలీసుల అదుపులో ఉన్నవారిని కోర్టుకు అప్పగించాలి



పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టులను కోర్టుకు అప్పగించి ప్రభుత్వం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి. ప్రస్తుతం జరిగినవి బూటకపు ఎన్‌కౌంటర్లుగానే భావిస్తున్నాం. ప్రజాస్వామికవాదులు, ప్రజలు దీన్ని ఖండించాలి.

- జోగి కోదండరావు, అమరుల బంధుమిత్రుల కమిటీ జిల్లా అధ్యక్షుడు



దివ్యాంగుల గ్రీవెన్స్‌లో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అర్హులకు పింఛన్లు మంజూరు చేయండి

- దివ్యాంగుల గ్రీవెన్స్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పింఛన్ల కోసం అర్జీలిచ్చిన అర్హులైన దివ్యాంగులకు సత్వరమే పింఛన్లు మంజూరు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్ 'స్వాభిమాన్' నిర్వహించి 11 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ నెల మూడో శుక్రవారం దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్‌ను నిర్వహిస్తున్నామని, అర్హులైన వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జడ్పీ సీఈవో సత్యనారాయణ, వైద్యారోగ్యశాఖ, రిమ్స్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన పీఆర్ మినిస్టీరియల్ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరే..

జిల్లా పీఆర్ మినిస్టీరియల్ సంఘ కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ మినిస్టీరియల్ సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నిక పీఆర్ ఎస్ఈ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నవోదయ, జిల్లా ఉపాధ్యక్షుడు జి.రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో జిల్లా అధ్యక్షుడిగా ఎ.సుధాకరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సూర్యకుమారి, ఉపాధ్యక్షుడి గా టి.పవన్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాళ్ల రమేష్, కోశాధికారిగా బి.లక్ష్మిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను సంఘం నేతలు అభినందించారు.

మత్స్యకారులకు స్వర్ణయుగం

(ఐదో పేజీ తరువాయి)

నలభై.. యాభై ఏళ్లకు సరిపడా మౌలిక వసతులను ముందే ఏర్పాటు చేస్తామన్నారు. మత్స్యకారులు పాతపద్ధతులు వదిలి పరిస్థితులకు తగ్గట్టు సాంకేతిక సంస్కరణల వైపు వెళ్లాలని సూచించారు. ప్రతి మత్స్యకారుడు తన కుటుంబ సభ్యుడితో సమానమని పేర్కొన్నారు. అనంతరం గతంలో చేపలవేట సమయాల్లో ప్రమాదవశాత్తు మృతి చెందిన 31మంది మత్స్యకార కుటుంబాలకు చెక్కులను అందించారు. వివిధ పథకాల కింద పలు ఉపకరణాలను పంపిణీ చేశారు. శ్రీకాకుళం, ఎచ్చెర్ల ఎమ్మెల్యేలు గొండు శంకర్, నడుకుదిటి ఈశ్వరరావు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్, ఆర్డీవో సాయిప్రత్యూష, మత్స్యకార సొసైటీల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులపై కోతల భారం

(ఐదో పేజీ తరువాయి)

కూలీలు ఎకరాకు రూ.6వేల నుంచి రూ.8వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. దీంతోపాటు కుప్పలు వేయడానికి మరో రూ.4వేలు వసూలు చేస్తున్నారు. ఆ కుప్పలు యంత్రం ద్వారా నూర్పిడికి గంటకు మరో రూ.4వేలు చొప్పున ఖర్చవుతోంది. ఇప్పటికే అధిక పెట్టుబడి పెట్టామని, తుఫాన్ల కారణంగా దిగుబడి తగ్గి నష్టపోయామని రైతులు ఆవేదన చెందుతున్నారు. పంట కోత కోసేందుకు అదనపు భారం తప్పడం లేదని పేర్కొంటున్నారు. కోత యంత్రమైతే ఎకరాకు రూ.4వేలు ఖర్చు చేస్తే చాలు.. కల్లానికి ధాన్యం చేరుతున్నాయని చెబుతున్నారు. కానీ పొలంలో బురద కారణంగా యంత్రాలు వినియోగించలేకపోతున్నామని పేర్కొంటున్నారు. పండిన పంట వదల్లేక.. కోత ఖర్చులు భరించలేక సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖర్చులు పెరుగుతున్నాయి..

తుఫాన్ కారణంగా వరి పంట కోత ఖర్చులు పెరుగుతున్నాయి. యంత్రాల ద్వారా అయితే ఎకరానికి రూ.4వేలు ఉంటే చాలు. అదే కూలీల ద్వారా అయితే రూ.15వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. కూలీల కొరత కారణంగా చాల్లా ఇబ్బందులు పడుతున్నాం.

-కోడూరు చంద్రమోహన్, రైతు, జగన్నాథపురం

ఇబ్బందులు పడ్డాం..

అధికంగా కూలీల రేట్లు పెరగడంతో పాటు చేతిలో డబ్బులు లేక ఇబ్బందులు పడ్డాం. ఈ సమయంలో ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు జమ చేయడం ఎంతో ఉపయోగపడ్డాయి. అ డబ్బులతో వరికోత పనులు చేస్తున్నాం.

-కలిశెట్టి అప్పారావు, రైతు

ఒడిశా నుంచి కర్ణాటక

(ఐదో పేజీ తరువాయి)

బల్లిగుడ ప్రాంతానికి చెందిన అలోక్ ధఘాల్‌తో పరిచయం ఏర్పడింది. వారిద్దరూ కొన్నాళ్లుగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన వ్యాపారి తిప్పే స్వామికి గంజాయి తీసుకెళ్లి విక్రయించేవారు. శుక్రవారం ఒడిశాలో కొనుగోలు చేసిన 7.160 కేజీల గంజాయిని కర్ణాటక తరలించేందుకు ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్‌కి చేరుకున్నారు. తనిఖీలు చేపడుతున్న ఎస్ఐ ముకుందరావుకు వీరిద్దరూ అనుమానాస్పదంగా కనిపించారు. వారివద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా గంజాయి ఉన్నట్లు గుర్తించి సీజ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ చిన్నమనాయుడు తెలిపారు.



మంచాలపేట - కోటబొమ్మాళి రోడ్డులో దట్టంగా కురుస్తున్న పొగ మంచు

దట్టంగా పొగమంచు

కోటబొమ్మాళి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రోజు రోజుకు చలి తన పంజా విసురుతోంది. గత నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరిగింది. ఉదయం తొమ్మిది గంటలైన సూర్యడిని పొగమంచు కప్పేస్తోందా అనేలా పరిస్థితి కనిపిస్తోంది. కోటబొమ్మాళి చుట్టుపక్కల ప్రాంతాల్లో చలికారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, ఇంటి పనులు చేసుకునే మహిళలు తమ పనులు ఆలస్యంగానే మొదలెడు తున్నారు. దట్టంగా పొగమంచు అలుముకుంటుండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.



సైకిల్ యాత్రికుడు దీపక్ శర్మకు స్వాగతం పలుకుతున్న వీహెచ్‌పీ సభ్యులు

యువతను చైతన్య పరిచేందుకే సైకిల్ యాత్ర

ఇచ్ఛాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): హర్యానా రాష్ట్రం పానిపట్‌కు చెందిన దీపక్ శర్మ 'ఆపరేషన్ సిందూర్-సంకల్ప వికసిత్ భారత్ చార్‌ధామ్' పేరిట సైకిల్ యాత్ర చేస్తూ శుక్రవారం ఇచ్ఛాపురం చేరుకున్నారు. ఈయనకు విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. దీపక్ శర్మ మాట్లాడుతూ.. యువతలో సేవాభావం, ఐక్యతా, పర్యావరణం, దేశభక్తి, తదితర అంశాలపై అవగాహన కల్పించడమే తన యాత్ర లక్ష్యమన్నారు. మే25న పానిపట్ నుంచి చార్‌ధామ్ యాత్ర చేపట్టానని, ఇప్పటివరకు ఆంధ్రా, ఒడిశా బోర్డర్ ఇచ్ఛాపురం చేరేసరికి 7,650 కి.మీ. పూర్తయిందన్నారు. శనివారం యాత్ర కొనసాగుతుందన్నారు. వీహెచ్‌పీ సభ్యులు ధనుష్ (రంగా), మోహన్, శ్రీను, రాజారెడ్డి పాల్గొన్నారు.


ఉద్దానం గుట్టు విప్పేందుకు..

- కిడ్నీ సమస్యలకు కారణాలపై అధ్యయనానికి ప్రాజెక్టు మంజూరు
- క్రానిక్ కిడ్నీ డీసీజ్ ఆఫ్ అన్‌నోన్ ఇథియాలజీ ఇన్ శ్రీకాకుళం జిల్లా పేరుతో..
- మూడేళ్లపాటు అధ్యయనం చేయనున్న డాక్టర్ రవిరాజు నేతృత్వంలోని బృందం
- ఇప్పటికే గుర్తించిన అంశాలతోపాటు మరిన్ని వాటిపై లోతైన విశ్లేషణ
- ఈ ప్రాంతంలో 18 శాతం మంది ప్రజల్లో కిడ్నీ జబ్బులు ఉన్నట్టు నిర్ధారణ

విశాఖపట్నం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించపోతోంది. సీఎం చంద్రబాబునాయుడు, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వినతి మేరకు కేంద్ర ప్రభుత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ రీసెర్చ్ మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్.. 'క్రానిక్ కిడ్నీ డీసీజ్ ఆఫ్ అన్‌నోన్ ఇథియాలజీ ఇన్ శ్రీకాకుళం' పేరుతో ఓ ప్రాజెక్టు మంజూరు చేసింది. దీనిపై పరిశోధన చేసిన ప్రముఖ నెఫ్రాలజిస్ట్, ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ టి.రవిరాజును ఈ ప్రాజెక్టుకు మెంటార్‌గా నియమించింది. మూడేళ్ల పాటు పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలని ఆదేశించింది. ఈ పరిశోధన కోసం రూ.6.01 కోట్లు కేటాయించింది.

బృందంలోని వారు..

మూడేళ్లపాటు జరిగే ఈ పరిశోధన బృందానికి డాక్టర్ టి.రవిరాజు మెంటార్‌గా వ్యవహరిస్తుండగా, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా డాక్టర్ జి.ప్రసాద్, కో ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్స్‌గా డాక్టర్ ఆర్.సత్యనారాయణ, డాక్టర్ కె.అరుణ లక్ష్మి, డాక్టర్ శ్రీధర్ శోభనాపురం, డాక్టర్ ఏ.కృష్ణవేణి వ్యవహరించనున్నారు. ఈ



పరిశోధనకు అంతర్జాతీయ స్థాయి నిపుణులుగా ఉన్న యూనివర్శిటీ ఆఫ్ నార్త్ కరోలినా ఎల్ చాపెల్ హిల్స్‌కు చెందిన డాక్టర్ ప్రబీర్ రాయ్ చౌదరి, బోస్టన్‌లోని బ్రిఘమ్ అండ్ వుమెన్స్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ అజయ్ కె సింగ్ కో ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్స్‌గా ఉంటారు.

కారణాలు ఇవేనా?

ఉద్దానంలో అత్యధికంగా 18 శాతం మంది ప్రజలు కిడ్నీ జబ్బులతో బాధపడుతున్నట్టు ఇప్పటికే చేసిన అధ్యయనంలో తేలింది. అయితే ఈ వ్యాధికి గల కారణాలు ఏమిటన్న దానిపై స్పష్టత లేదు. అయితే కిడ్నీ సమస్యకు కొన్ని కారణాలు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. ఇక్కడ అధికంగా పెస్టిసైడ్స్ వినియోగించడం, కలుషిత నీరు, ఇనుప పైపుల ద్వారా నీటి సరఫరా జరుగుతుండడం వల్ల సిలికా లెవెల్స్ అధికంగా ఉండడం కారణాలుగా చెబుతున్నారు. అయితే వీటిని ఎవరూ నిర్ధారించడం లేదు.

ఏం పరిశోధన చేస్తారు?

ఈ పరిశోధనలో భాగంగా ప్రజలతో మాట్లాడడంతో పాటు నమూనాలను సేకరిస్తారు. 5500 మంది నుంచి రక్తం, యూరిన్ తీసుకుని పరీక్షిస్తారు. మట్టి, నీటి నమూనాలను సేకరించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేస్తారు. నీటి, మట్టి నమూనాల్లో కిడ్నీ వ్యాధులకు కారణమయ్యే అంశాలు ఏవైనా ఉన్నాయా? అని పరీక్షిస్తారు. కిడ్నీ వ్యాధి రెండు, మూడేళ్ల తరువాత వచ్చేందుకు అవకాశం ఉన్న వారిని ముందుగా గుర్తించేలా బయోమార్కర్స్ పరీక్షలు చేస్తారు. ఈ పరిశోధనలకు అత్యాధునిక పరికరాలతో కూడిన ల్యాబ్‌ను రూ.కోటి వ్యయంతో ఆంధ్ర మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నారు. ప్రాజెక్టు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ టి.రవిరాజు మాట్లాడుతూ పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి కారణాలను తెలుసుకుంటామన్నారు. జెనిటిక్ బ్యాక్‌గ్రౌండ్ ఉందా? అన్నది కూడా తేలుస్తామన్నారు. ఈ వ్యాధిని నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలను గుర్తిస్తామని వెల్లడించారు. పరీక్షల అనంతరం ప్రజలకు అందించాల్సిన మందులపై ప్రభుత్వానికి సూచనలు చేస్తామని తెలియజేశారు.

ఎట్టకేలకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం

● సర్వే నెంబర్ 163కు క్లియరెన్స్
● 'ఆంధ్రజ్యోతి' కథనానికి కృతజ్ఞతలు

పొందూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పొందూరు పట్టణ ప్రజలు ఐదేళ్లుగా పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం లభించింది. ఐదేళ్లుగా పట్టణంలోని సర్వే నెంబర్ 163-1 రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిపై గతనెల 22న 'ఆంధ్రజ్యోతి'లో 'భూములు అమ్ముకునేదెలా?' శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎట్టకేలకు ఈ భూములకు రిజిస్ట్రేషన్ చేసేందుకు మార్గం సుగమం కావడంతో స్థానికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రెవెన్యూ, దేవదాయ శాఖ ఉన్నతాధికారుల నుంచి రిజిస్ట్రేషన్లకు అనుమతులు వచ్చాయి. దేవదాయశాఖాధికారులు కేవలం 40 సెంట్ల స్థలం కోసం గత వైసీపీ ప్రభుత్వంలో 163-1 సర్వే నంబరులో 64.5 22-ఏ రిజిష్టర్‌లో నమోదు చేయడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ఆ ప్రభుత్వంలో స్పీకర్‌గా పనిచేసిన తమ్మినేని సీతారాం హామీ ఇచ్చినా పరిష్కారం కాలేదు. దీనిపై గత ఏడాదిన్నరగా ఎమ్మెల్యే కూన రవికుమార్ చేసిన కృషి ఫలితం ఇవ్వడంతో సమస్యకు పరిష్కారం లభించింది. ఈ సందర్భంగా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అనకాపల్లి చినరంగా, ఉపాధ్యక్షుడు బాడాన గిరి విలేకరులతో మాట్లాడుతూ.. ఐదేళ్లుగా పట్టణ వాసులకు సమస్యగా ఉన్న సర్వే నెంబర్ 163 సమస్యకు ఎమ్మెల్యే రవికుమార్ కృషితో పరిష్కారం లభించిందన్నారు. పట్టణ వాసుల తరఫున ఎమ్మెల్యేకి, 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. సమావేశంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు ఎ.విజయలక్ష్మి, నాయకులు దండా రవికుమార్, కాలెపు శ్రీనివాసరావు, డి.మురళి, పి.రామకృష్ణ, పాపారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

భార్యపై దాడి చేసిన భర్తకు 14 రోజుల రిమాండ్

శ్రీకాకుళం క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భార్యపై దాడి చేసిన కేసులో భర్తకు ఫస్ట్‌క్లాస్ ఏడీజే కోర్టు న్యాయాధికారి 14 రోజులు రిమాండ్ విధించినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. నగరంలోని పెద్దరెల్లివీధికి చెందిన బొమ్మాళి గిరిబాబు ఈనెల 8న భార్య స్వర్ణ కుమారిపై దాడి చేసి గాయపరిచారు. దీంతో ఆమె రిమ్స్ లో చికిత్స పొందారు. ఆమె ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్ఐ లక్ష్మి కేసు నమోదు చేసి గిరిబాబును శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో ప్రవేశ పెట్టారు. ఈ మేరకు నిందితుడికి రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

కారు దగ్ధం: తప్పిన ప్రమాదం


దగ్ధమైన కారు

రణస్థలం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పైడిభీమవరం సమీపంలో హైవేపై జూట్ మిల్లు ఎదురుగా శుక్రవారం కారు దగ్ధమైంది. విశాఖపట్నం మధురవాడకు చెందిన గౌరీశంకర్ శుక్రవారం ఉదయం శ్రీకాకుళం కారుతో వచ్చి తన పని ముగించుకుని తిరిగి విశాఖ వెళుతున్నారు. పైడిభీమవరం వచ్చేసరికి కారు ఇంజన్ నుంచి పొగలు రావడంతో కారు పక్కకు తీసి దిగి పోయారు. మంటలు రావడంతో తక్షణం స్థానికులు రణస్థలం ఫైర్ స్టేషన్‌కు సమాచారమిచ్చారు. ఎస్ఎఫ్‌వో డి.హేమసుందరరావు సిబ్బందితో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని ఎస్ఎఫ్‌వో తెలిపారు. అయితే ఈ ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఒక్కరే ప్రయాణించడం, అతను కూడా మంటలను గమనించి వెంటనే దిగి పోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరుగలేదు.

చెరకు తోటలో అగ్ని ప్రమాదం

బూర్జ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దపేట రెవెన్యూ పరిధిలో మదనాపురం గ్రామంలో నెక్కింటి నాగేశ్వరరావుకు చెందిన చెరకు తోటలో శుక్రవారం మంటలు వ్యాపించాయి. పక్కనున్న పొలంలో పొలంలో చెత్తను కాల్చేందుకు పెట్టిన నిప్పు ఎగిసి పడడంతో ఐదెకరాల చెరకు తోటకు అంటుకున్నాయి. వెంటనే స్థానికులు పాలకొండ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా ఫైర్ ఎస్ఐ సర్వేశ్వరరావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఎకరం చెరకు కాలిపోగా సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు.

'మొదలవలస'పై నిర్బంధ ఉత్తర్వులు రద్దు

శ్రీకాకుళం క్రైమ్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేటకి చెందిన మొదవలస చిరంజీవి (63)పై కలెక్టర్ జారీ చేసిన పీడీ యాక్ట్ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. 14 క్రిమినల్ కేసుల్లో పాలుపంచుకున్నాడని కలెక్టర్ నివేదిక ప్రకారం.. ప్రజలను లక్ష్యం చేసుకుని దాడులు చేస్తున్నాడని ఐపీసీ, బీఎన్ఎస్ లోని పలు సెక్షన్ల కింద అతనిపై కేసులు ఉన్నాయని, అతని చర్యలు శాంతిభద్రతలకు ప్రమాదమని భావిస్తూ గుండా చట్టం 2(జీ) ప్రకారం అక్టోబరు 15న నిర్బంధ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులను ప్రభుత్వం కూడా ఆమోదించింది. చట్టప్రకారం మూడు వారాల్లో కేసుకు అడ్వయిజరీ బోర్డుకు పంపాలి. దానికి అనుగుణంగా కేసును కోర్టు ముందుకు తీసుకెళ్లారు. నవంబరు 12న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టగా అడ్వైజరీ బోర్డు.. నిర్బంధితుడు, దర్యాప్తు అధికారి వాదనలు విని రికార్డులు పరిశీలించింది. నిర్బంధానికి తగిన కారణాలు లేవని అడ్వైజరీ బోర్డు తన నివేదికలో ప్రభుత్వానికి స్పష్టం చేసింది. ఈ నివేదికను పరిగణన లోకి తీసుకున్న ప్రభుత్వం చిరంజీవిపై జారీ చేసిన నిర్బంధ ఉత్తర్వులను శుక్రవారం రద్దు చేసింది. వెంటనే చిరంజీవిని విడుదల చేయాలని ఆదేశించింది. అయితే ఇతర కేసుల్లో అవకాశం ఉంటే ఆ మేరకు అధికారులే నిర్ణయించాలని పేర్కొంది. ఈ ఉత్తర్వులను విశాఖపట్నం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌కు, కలెక్టర్, జిల్లా పోలీసు అధికారులకు కూడా సమాచారం పంపింది.

జేజేఎం పనుల వేగవంతానికి చర్యలు

ఎచ్చెర్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో ఇంటింటికీ తాగునీరందించే జల్ జీవన్ మిషన్ పనులు వేగవంతం చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ పి.దుర్యోధనరావు అన్నారు. చిలకపాలెంలో 40 వేల లీటర్ల నీటి సామర్థ్యం కలిగిన ట్యాంకు నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన 189 పనులకు రూ.62 కోట్లతో ప్రణాళికలు రూపొందించామన్నారు. వీటిలో ప్రారంభమైన కొన్ని పనులకు రూ.6 కోట్లు చెల్లింపులు కూడా జరిగాయన్నారు. ఎస్ఎంపురం, కేశవరావుపేట, కోదువానిపేట, చినరావుపల్లి, నందిగాం తదితర గ్రామాల్లో ఈ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఈ ఎ.రవికాంత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

అరసవల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక విశాఖ-ఎ కాలనీలోని తన కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే దూరదృష్టి, సమర్థత కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని అన్నారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. దీనివల్ల లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయన్నారు. గార, రూరల్, శ్రీకాకుళం మండలాల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి తక్షణ పరిష్కారానికి సంబంధిత అధికారులకు సూచించారు.

● ఆమదాలవలస, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని టీడీపీ పట్టణ అధ్యక్షుడు సంపతిరావు మురళీ అన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగళ్ల మురళీధర్ యాదవ్, షేక్‌మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

భూసారాన్ని బట్టి ఎరువులు వాడాలి

ఇచ్ఛాపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూసారాన్ని బట్టి ఎరువులు వినియోగించాలని వ్యవసాయాధికారి అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం బెల్లుపడ గ్రామంలో ఆత్మ ప్రాజెక్ట్ సౌజన్యంతో రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఎరువుల వినియోగం, మట్టినిల్వ కార్డు (సోయిల్ హెల్త్ కార్డ్) ఆధారంగా భూమి పోషకాలస్థాయి, వాటి లోపాల నివారణ, ఎరువుల వినియోగాన్ని వివరించారు. పంట పెరుగుదల, వంగడాల అనుకూలత, తెగుళ్ల నిరోధకత, నీటి వినియోగ సామర్థ్యం, దిగుబడి సాధికారత వంటి అంశాలను రైతులకు వివరించారు. రైతులకు సోయిల్ హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ మల్లేష్, రైతులు రెయ్యి జానికిరావు, గిన్ని వెంకటరమణ, సత్యం, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పి.కొజ్జిరియా వద్ద రైల్వే స్టేషన్ ఏర్పాటుకు చర్యలు


పి.కొజ్జిరియా రైల్వే జంక్షన్ వద్ద పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

ఇచ్ఛాపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జాడుపూడి- ఇచ్ఛాపురం రైల్వే మార్గంలో పెద్ద కొజ్జిరియా వద్ద కొత్తగా రైల్వే స్టేషన్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామని ఖుర్దా డివిజన్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అజయ్ కుమార్, జేఈ మహంతి అన్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలకు రైలు సౌకర్యాలు కల్పించి పాసింజర్ రైలు నిలుపుదల చేయాలని గతంలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, చీకటి ఎమ్మెల్యే మనోరంజన్ ధ్యాన సామంతరాయ్ ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు శుక్రవారం రైల్వే అధికారులు ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడి ప్రజల అవసరాలు, డిమాండ్‌ను గుర్తించారు. ఈ నివేదికను రైల్వే ఉన్నతాధికారులకు అందజేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో జడ్ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాస్ రౌళో, సర్పంచ్ నీలవేణి, పద్మనాభం, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రిగ్ బోరుకు శంకుస్థాపన

బూర్జ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెద్దపేట పంచాయతీ నీలాపురం గ్రామంలో రిగ్ బోరు ఏర్పాటుకు రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణనాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఇంటింటికి తాగునీరందించాలనే ఉద్దేశంతో బోరు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దూబ బాలకృష్ణ, వావిలపల్లి ఆదినారాయణ, మామిడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల్లో ఆందోళన


ధాన్యం ఎగరబోస్తున్న రైతులు

గార, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో మండలంలో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ వరి పంటను కుప్పలుగా పెట్టడం, కొంతమంది నూర్పులు చేస్తున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులతో పంటలను రక్షించుకునేందుకు పాట్లు పడు తున్నారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సూర శ్రీనివాసరావు అన్నారు. స్థానిక స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ సాఫ్ట్‌బాల్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్ చేసి కార్యక్రమం ప్రారంభించారు. నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో జిల్లాలో సాఫ్ట్‌బాల్ వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. త్వరలో క్రీడాపరికరాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ ఎంవీరమణ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆకతాయిలకు కౌన్సెలింగ్

రణస్థలం/ శ్రీకాకుళం క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రణస్థలం ప్రాంతంలో కళాశాలలు, ప్రధాన కూడళ్లలో విద్యార్థినులను ఆటపట్టిస్తూ ఈవ్ టీజింగ్‌కు పాల్పడుతున్న యువకులను జేఆర్ పురం ట్రైనీ ఎస్ఐ మౌనిక ఆధ్వర్యంలో శక్తి టీం సిబ్బంది పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అక్కడ వారి తల్లిదండ్రుల సమక్షంలో ఎస్ఐ చిరంజీవి కౌన్సెలింగ్ నిర్వహించారు. శక్తి టీం సిబ్బంది వారిని విచారించి జరిగిన ఘటనలపై వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. బాధ్యతగా వ్యవహరించి క్రమశిక్షణతో చదువుకోవాలని, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి

● ఎమ్మెల్యే గొండు శంకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో విద్యార్థులు ముందుండాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నైర వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బైరివానిపేటలో జరుగుతున్న సేవా శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ శిబిరాలు విద్యార్థుల్లో సేవాభావం పెంపొందిస్తుందన్నారు. గ్రామాల్లో వివిధ అంశాలపై అవగాహన కలిగించడం అభినందనీయమన్నారు. నైర కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు వ్యవసాయం, ఆధునిక సాంకేతిక, లాభదాయక పంటల పై అవగాహన కలిగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి డా.ఎం.సుధాకర్, డా.జి. జోగినాయుడు, పీజీ మూర్తి నరేష్, ప్రతాప్, డా. కె రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కళింగసీమ కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్‌పోటీల్లో బొరివంక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. శుక్రవారం నిర్వహించిన క్విజ్ పోటీలో పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో గీతం హైస్కూల్ (హరిపురం) ద్వితీయ, జడ్పీహెచ్ఎస్ హరిపురం విద్యార్థులు తృతీయ స్థానం పొందారు. గెలుపొందిన విద్యార్థులకు ఎమ్మెల్యే బెందాళం అశోక్ షీల్డ్, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, చిన బాబు, ఎంఈవో ధనుంజయ మజ్జి, హెచ్ఎం సంతోషి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారానికి చర్యలు


హాస్టల్ గదిని పరిశీలిస్తున్న దృశ్యం

కంచిలి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, టెన్త్, ఇంటర్ విద్యార్థుల శతశాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు దృష్టి సారించాలని ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ పీఎంజే బాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.సునీల్, జిల్లా గురుకులాల సమన్వయాధికారి వై.యశోదలక్ష్మి అన్నారు. కంచిలి డా.బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల/కళాశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ కనబరచాలని, రుచికరమైన భోజనాలను విద్యార్థులకు అందించాలన్నారు. గురుకులంలోని సమస్యలను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. అర్ధాంతరంగా నిలిచి పోయిన క్లాస్ రూమ్స్ నిర్మాణం పనులు వేగవంతం చేయాలని డీఈ, ఏఈలను ఆదేశించారు. ఉద్దానం సుజల స్రవంతి ద్వారా విద్యార్థులకు తాగునీరందించాలని ప్రిన్సిపాల్ కోరగా దీనికి వారు స్పందిస్తూ ప్రతిపాదనలు పంపాలని సూచించారు. పిల్లలతో కలిసి భోజనాలు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చేపడుతున్న వాలీబాల్ కోర్టు, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ వర్కులను అధికారులు పరిశీలించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

శ్రీకాకుళం రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. అలికాంలో శుక్రవారం క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆంధ్ర సాధించాలంటే అందరి సహకారం అవసర మన్నారు. స్వచ్ఛ భారత్-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమాల లక్ష్యాలను అర్థం చేసుకుని వాటిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.ప్రకాశరావు, డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి: శివ్వాల

సరుబుజ్జిలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని డీసీసీబీ ఛైర్మన్ శివ్వాల సూర్యనారాయణ అన్నారు. షలంత్రి గ్రామంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరుబయట మల విసర్జన నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. రోడ్లపై పశువులను కట్టడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దీనిని నిషేధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.పావని, డిప్యూటీ ఎంపీడీవో రామారావు, స్థానిక నాయకుడు అదపాక గౌరునాయుడు, ఆయుర్వేద వైద్యాధికారి పురుషోత్తమరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల పరిశుభ్రతకు సహకరించండి

జి.సిగడాం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో జి.రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఎస్‌డబ్ల్యూఎస్ కేంద్రం వద్ద శుభ్రత-పరిశుభ్రతపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన

గార, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రత, పచ్చదనంలో భాగంగా శుక్రవారం శ్రీకూర్మంలో మండలస్థాయి గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ గార్డులకు ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లాప్‌మిత్రలకు చెత్త సంపద తయారీ కేంద్రాల్లో తడిచెత్త, పొడిచెత్త వేరుచేసే విధానం, ఇంటింటి నుంచి చెత్త సేకరణపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, నేతలు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు గ్రామసభలు

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డుల కోసం దరఖాస్తులను స్వీకరిస్తు న్నట్లు నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయితీల్లో శనివారం గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఈ సభల ఏర్పాటుకు ఉపాధి హామీ సిబ్బంది, మండల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి వేతనదారులు ఈ సభల్లో తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని కోరారు. కొత్త జాబ్ కార్డుల కోసం దరఖాస్తులు వస్తే స్వీకరించి, మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈకేవైసీ కారణంగా తొలగించబడిన జాబ్‌కార్డులను మరలా పరిశీలించి, అర్హులైన వారికి పునరుద్ధరించే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

రెండోరోజూ సాగర్ కవచ్

గార, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత భద్రతలో భాగంగా నిర్వహిస్తున్న సాగర్ కవచ్ రెండో రోజు శుక్రవారం కూడా నిర్వహించారు. మెరైన్ సీఐ బి.ప్రసాదరావు సిబ్బందితో కలిసి మండలంలోని ముఖ్య కూడళ్ల వద్ద వాహనాలను తనిఖీ చేశారు.

300 మందికి వైద్య పరీక్షలు

ఆమదాలవలస, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 19వ వార్డు పాత ఆమదాలవలస రామమందిరం వద్ద శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. టీడీపీ వార్డు ఇన్‌చార్జి పాగోటి మణికంఠ ఆధ్వర్యంలో డా. సౌమ్య సుమారు 300 మందికి పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు తంగి శంకర్, నాయకులు బండి దివాకర్, అంబటి ప్రకాశరావు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ పరికరాలు చోరీ

కవిటి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మాణిక్యపురం గ్రామంలో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌లో కొన్ని పరికరాలను దొంగిలించారు. గ్రామానికి సమీపంలో వ్యవసాయ అవసరాల నిమిత్తం ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న వైర్లు తొలగించి పరికరాలు దోచుకు పోయారు. ట్రాన్స్‌ఫార్మర్ కప్పులు మాత్రమే మిగిలాయని విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

29న మెగా వైద్యశిబిరం

శ్రీకాకుళం లీగల్ నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29న కొత్త భవనంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు తంగి శివప్రసాద్, ప్రధానకార్యదర్శి పిట్టా దామోదర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా ప్రారంభిస్తారని న్యాయవాద కుటుంబాలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో సీనియర్ న్యాయవాదులు వాన కృష్ణ చంద్, ఆగూరు ఉమామహేశ్వరరావు, ఎన్ని సూర్యారావు, పేరూరి నాగేశ్వరరావు, జల్లు తిరపతిరావు, మామిడి క్రాంతి, కొమ్ము రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ జర్నల్‌లో ఆర్జీయూకేటీ అధ్యాపకుడి వ్యాసం

ఎచ్చెర్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ, శ్రీకాకుళం క్యాంపస్ ఆంగ్ల అధ్యాపకుడు డాక్టర్ రాకోటి శ్రీనివాసరావు రాసిన 'అనాలిసిస్ ఆఫ్ ఆప్టిమల్ ఎక్స్‌పీరియన్స్ ఆఫ్ ఆనరాండ్స్ ప్రొటగోనిస్ట్' వ్యాసం అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురితమైంది. ఈ పరిశోధనాత్మక వ్యాసాన్ని ఇటరేటివ్ అంత ర్జాతీయ సంస్థ ప్రచురించింది. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరావును క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీ జీడీ బాలాజీ, ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ శివరామకృష్ణ అభినందించారు. ఎఫ్‌వో వాసు, వెల్ఫేర్ డీన్ రవి, ఇంగ్లీష్ విభాగాధిపతి నూకేశ్వరరావు తదితరులు అభినందించారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

కవిటి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులు ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని తీర ప్రాంత మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు బడే తమ్మారావు అన్నారు. శుక్రవారం ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా కవిటి సముద్ర తీరంలో మహిళలు గంగమ్మ తల్లికి పూజ లు చేశారు. అనంతరం సముద్ర జలాన్ని బిందెలతో తీసుకొని వచ్చి మత్స్య కార భవనం వద్ద శ్రీమత్స్య నారాయణ స్వామి గంగమ్మ తల్లికి పూలమాలలు వేసి పూజలు చేశారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు సూరాడ చంద్రమోహన్ మాట్లాడుతూ.. ఫిషింగ్ హార్బర్లు తదితర సమస్య లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. కార్యక్రమంలో తీర ప్రాంత మత్స్యకార ఐక్య వేదిక అధ్యక్షుడు దళ డిల్లేష్, గురుమూర్తి, సూర్ని రమేష్, దాలయ్య, వండయ్య, చలపరాయ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలస్యంగా వేసిన నాట్లు కాపాడుకోవాలి

సోంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆలస్యంగా వేసిన వరినాట్లను కాపాడుకునేందుకు చొరవ చూపాలని ఏవో బి.నరసింహమూర్తి కోరారు. పలాసపురం, జింకిభద్ర గ్రామాల్లో శుక్రవారం వరిపంట పొలాలను పరిశీలించారు. గడచిన 10 రోజులుగా వాతావరణ మార్పులతో వరిపైరు పంట దశ మారడం కొద్దిగా ఆలస్యం అవుతోందన్నారు. దీన్ని అధిగమించేందుకు పొటాష్, భాస్వరం, సల్ఫర్, పోషకాల్లో ఏదో ఒకటి తక్షణమే పిచికారి చేస్తే కంకులు బయటకు వస్తాయన్నారు. కంకిలో గింజలు గట్టిపడేవరకు పొలంలో నీరు ఉంచాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

గుజరాతీపేట. నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సదస్సుకు ప్రభుత్వ పురుషుల కళాశాల (ఆర్ట్స్) ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీ విద్యా ర్థులు నలుగురు ఎంపికయ్యారు. పరిశోధనా రంగాల్లో పంపించిన పత్రాల ఆధారంగా మణికంఠ, జగదీష్, మాధవి, తేజేశ్వరిలను ఎంపిక చేశారు. ఈ సదస్సు డిసెంబరులో మూడు రోజులపాటు నిర్వహిస్తారని, ఆ సదస్సులో పరిశోధనా పత్రాలను విద్యార్థులు ప్రదర్శిస్తారని ప్రిన్సిపాల్ డా. వై.పోలినాయుడు తెలిపారు. ఈ అరుదైన అవకాశం విద్యార్థులు దక్కించుకోవడంపై కళాశాల మెడికల్ బయో టెక్నాలజీ కో ఆర్డినేటర్ డా.ఎం. ప్రదీప్, అధ్యాపకులు హరిత రేణంకి, పైడి సుధారాణి, కె.ప్రశాంతి, కె.అపర్ణ తదితరులు హర్షం వ్యక్తంచేసి అభినందించారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన శ్రీధర్

సరుబుజ్జిలి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బప్పడాం గ్రామానికి చెందిన పేడాడ శ్రీధర్(41) గురువారం రాత్రి తన ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ బి.హైమావతి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. శ్రీధర్ కొన్నాళ్లగా వివిధ నేరాలలో నిందితుడిగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నేర చరిత్ర కలిగిన వ్యక్తిగా గుర్తింపబడ్డాడు. ఇటీవల తన స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన కేసులో జైలుకు వెళ్లి బెయిల్‌పై వచ్చాడు. నేర చరిత్రలో తనతో పాటు తల్లికి సంఘంలో గౌరవం దక్కడం లేదని మనస్తాపం చెందిన శ్రీధర్ ఇంటిలోని వేరే గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది చూసిన అతడి తల్లి పేడాడ మణమ్మ కేకలు వేయగా ఇరుగు పొరుగువారు వచ్చి రక్షించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. శుక్రవారం శ్రీకాకుళం నుంచి క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. శ్రీధర్ తల్లి మణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో టీడీపీ నాయకుడి మృతి

● పార్టీ జెండా కప్పి నివాళులర్పించిన ఎమ్మెల్యే రమణమూర్తి


వెంకట్రావు అంత్యక్రియలో పాల్గొన్న ఎమ్మెల్యే రమణమూర్తి, టీడీపీ నాయకులు


వెంకట్రావు (ఫైల్)

నరసన్నపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకులు త్రిపురాన వెంకట్రావు (ప్రెస్ వెంకట్రావు) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలో చురుకైన పాత్ర పోషించేవారు. ఈయన నిర్వహించిన ప్రింటింగ్ ప్రెస్ నుంచే కొన్నాళ్లు టీడీపీ కార్యాలయంగా కార్యకలాపాలు నిర్వహించేవారు. వెంకట్రావు మృతి పార్టీక తీరని లోటని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. పార్టీ జెండా వెంకట్రావు మృతదేహంపై నివాళులర్పించారు. టీడీపీ నాయకులు పీస కృష్ణ, జామి వెంకట్రావు పాడి మోసారు. నియోజవర్గ టీడీపీ సమన్వయకర్త బగ్గు అర్చన, నాయకు లు పుచ్చల విశ్వేశ్వరరావు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..


మృతి చెందిన అప్పయ్య

బూర్జ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గుత్తావల్లి గ్రామానికి చెందిన ఇసుకపాలెం అప్పయ్య(76) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడని ఎస్ఐ ప్రవల్లిక తెలిపారు. ఆమె తెలిపిన వివరాల మేరకు.. అప్పయ్య గురువారం రాత్రి 9 గంటల సమయంలో గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు తొలుత గుత్తావిల్లి పీహెచ్‌సీకి.. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆమె కొండభీంపురం వాసి?

సంతబొమ్మాళి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధి నౌపడ పరిసరాల్లో గురువారం గుర్తించిన ఓ గుర్తుతెలియని మృతదేహం టెక్కలి మండలం కొండభీంపురం గ్రామానికి చెందిన వివాహిత దాసరి పుష్పలతగా తెలుస్తుంది. భార్యభర్తల మధ్య గత కొన్నేళ్లుగా మనస్పర్థలు రావడంతో ఆరు నెలలుగా వేర్వేరుగా ఉంటున్నారు. గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు కూడా జరిగాయి. ఈ నేపథ్యంలో పుష్పలతది హత్యేనని అనుమానిస్తున్నారు. దీంతో ఆమె భర్త బాలకృష్ణను పోలీసులు విచారిస్తున్నట్టు సమాచారం. కాగా దీనిపై నౌపడ పోలీసులు సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

మద్యం మత్తులో హల్‌చల్ చేసిన వ్యక్తికి పదిరోజుల జైలు

శ్రీకాకుళంక్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో హల్‌చల్ చేసిన వ్యక్తికి పది రోజులు జైలుశిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కె.శిరామకృష్ణ తీర్పు ఇచ్చినట్టు వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 11వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో నగరంలోని దమ్మల వీధికి చెందిన పుక్కాల జ్ఞానేశ్వరరావు మద్యం మత్తులో ఎన్టీఆర్ కాలనీ, కంపోస్టు కాలనీ ప్రాంతాల్లో పబ్లిక్‌ను ఇబ్బంది కలిగించేలా ప్రవర్తించాడు. దీనిని గమనించిన శ్రీకాకుళం వన్‌టౌన్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. సెక్షన్ 294(బి) కింద ఓపెన్ డ్రింకింగ్ కేసు నమోదు చేశారు. నిందితుడిని శుక్రవారం సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు హాజరుపరచగా.. న్యాయాధికారి కె.శిరామకృష్ణ జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ మాట్లాడుతూ.. పబ్లిక్ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రజలకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజులు..

శ్రీకాకుళం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి బైక్ నడుపుతున్న వ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ రెండో తరగతి మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి కె.శివరామకృష్ణ తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ సీఐ రామారావు తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. శ్రీకాకుళం నగరంలోని జబ్బావీధికి చెందిన వారణాసి ప్రశాంత్ ఈనెల 20న మద్యం తాగి బైక్ నడుపుతూ ఏడు రోడ్ల జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. ఈ కేసులో నిందితుడ్ని శుక్రవారం రెండో తరగతి మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా విచారణ చేసి శిక్ష విధించారని సీఐ తెలిపారు. సీఐ రామారావు మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడిపే వారికి జైలుశిక్ష తప్పదని, వాహనచోదకులు వారి భద్రత కోసమే ఇలాంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

టెక్కలి పరిధిలో ఇద్దరికి జరిమానా..

టెక్కలి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసుల్లో పట్టుబడిన ఇద్దరికి టెక్కలి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ యు.మాధురి చెరో పది వేల రూపాయల జరిమానా విధించినట్టు సీఐ ఎ.విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. జీడిపేటకు చెందిన పసుపురెడ్డి మహేష్, పెద్దసాన గ్రామానికి చెందిన అట్టాడ నాగరాజు మద్యం తాగి వాహనం నడిపి, వాహన తనిఖీల్లో పట్టుబడినట్టు తెలిపారు. కోర్టులో హాజరు పరచగా న్యాయాధికారి శిక్ష విధించారన్నారు.

సానుకూల వాతావరణం అవసరం

టెక్కలి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై తరగతి గదిలో సానుకూల వాతావరణం అవసరమని వారణాసి చిన్మయి రీసోర్స్‌పర్సన్ డాక్టర్ ఆర్.శాంతికుమార్ అన్నారు. శుక్రవారం ఐతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు ట్రిస్ప్రీ బోధనపై అవగాహన కల్పించారు. ఏఐసీటీఈ మార్గదర్శకాలు అనుకరించి నిర్వహించినట్టు తెలిపారు. డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రత్నమణి, డాక్టర్ రమణయ్య ఉన్నారు.

కొనసాగుతున్న సాగర్ కవచ్

పోలాకి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత భద్రతలో భాగంగా రెండో రోజు శుక్రవారం రాజారాంపురంలో సాగర్ కవచ్ నిర్వహించినట్టు ఎస్ఐ జిం.రంజిత్ తెలిపారు. సాగరతీరగ్రామాలైన గుప్పెడుపేట, గుల్లవానిపేట, కొత్తరేవు, కంబాలవానిపేట, కొవిరిపేట గ్రామాల పరిధిలో గస్తీ ఏర్పాటు చేశామన్నారు. అపరచిత వ్యక్తులు తారసపడితే తెలియజేయాలన్నారు.

పాసులైతే ఇచ్చారు.. బస్సులేవీ?

● ఉదయం, సాయంత్రం పూట ఒక్కటే..
● ఆర్టీసీ బస్సుల కోసం విద్యార్థుల అవస్థలు


జలుమూరులో కాలేజీ విడిచిపెట్టిన తరువాత బస్సెక్కడానికి ఇబ్బంది పడుతున్న విద్యార్థులు

జలుమూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అసలే శీతాకాలం సాయంత్రం 5 గంటలకే పొద్దుపోయి చీకటి పడుతుంది. చీకటి పడక ముందు ఇంటికి చేరుకోవడానికి విద్యార్థులు ఆతృత. దీంతో కళాశాల విడచిపెట్టిన తర్వాత వచ్చిన బస్సెక్కేడానికి విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. కళాశాలలకు వెళ్లిన ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ఇదే పరిస్థితి నెలకొంటుంది. విద్యార్థుల కోసం అదనపు బస్సులు వేయకపోవడంతో వచ్చే ఆ ఒక్క బస్సు ఎక్కడానికి ఫీట్లు వేయాల్సిందే. జలుమూరులో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శ్రీముఖలింగం, నగిరికటకం, అచ్యుతాపురం, బుడితి, బద్రి తదితర గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చిపోతుంటారు. అయితే విద్యార్థుల సౌలభ్యం కోసం ఉదయం, సాయంత్రం కళాశాల తెరచి, విడచిపెట్టే సమయంలో అదనపు ఆర్టీసీ బస్సులు నడపక పోవడంతో ఒకేసారి విద్యార్థులు బస్సు ఎక్కేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. బస్సు కదలిన తరువాత బస్సెక్కడం ప్రమాదమని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తుందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. ఆర్టీసీ బస్సులకు పాసులు ఇచ్చారే తప్పా ఆ స్థాయిలో బస్సులు నడపకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్టు వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ఉదయం, సాయంకాలం విద్యార్థుల కోసం అవసరమైన అదనపు బస్సులు నడిపి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

● టెన్నికాయిట్ పోటీలు ప్రారంభించిన ఎమ్మెల్యే శిరీష


క్రీడాజ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

హరిపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): క్రీడలకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం మందస మండలం సొండిపూడి జడ్పీ హైస్కూల్ ఆవరణలో 37వ రాష్ట్రస్థాయి బాలబాలికల టెన్నీకాయిట్ పోటీలను ఎమ్మెల్యే క్రీడాజ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. పాఠశాల క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహిస్తుందన్నారు. ఇక్కడ ప్రతిభ చూపినవారు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో టెన్నికాయిట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లా సంతోష్‌కుమార్, కార్యదర్శి సత్యనారాయణ, టీడీపీ నాయకులు భావన దుర్యోధన, దాసరి తాతారావు, పీరుకట్ల విఠల్‌రావు, లబ్బ రుద్రయ్య, బాస్కర్, చంద్రశేఖర్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

కోలుకుంటున్న చిన్నారులు


అంబులెన్స్‌లో శ్రీకాకుళం తరలిస్తున్న దృశ్యం

మందస, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మెత్తికాయలు తిని అస్వస్థతకు గురైన ఇద్దరు చిన్నారు శ్రీకాకుళం జెమ్స్‌లో కోలుకుంటున్నట్టు బుడంబో ఆసుపత్రి వైద్యులు సూర్య తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. బిత్తర బంద పరిధి అఖడ గ్రామానికి చెందిన నాలుగేళ్ల వయసు గల సవర విక్రమ్, సవర గంగా గురువారం ఉదయం ఆడుకుంటూ ఉమ్మెత్తకాయలను తినేసి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని గమనించిన వారి తల్లిదండ్రులు వెంటనే చికిత్స నిమిత్తం హరిపురం పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అదే రోజు మధ్యాహ్నం టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి, అక్కడి నుంచి శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా శుక్రవారం వైద్యసిబ్బందితో కలిసి వైద్యులు సూర్య గ్రామాన్ని సందర్శించి ఘటనపై వివరాలు సేకరించారు. ప్రస్తుతం చిన్నారులిద్దరూ జెమ్స్‌లో కోలుకుంటున్నట్టు ఆయన తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న జడ్పీటీసీ బుచ్చిబాబు

హిరమండలం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతులకు సేవలందించడంలో ప్రభుత్వం ముందంజలో ఉందని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు అన్నారు. శుక్రవారం చొర్లంగి రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితులు తూలుగు తిరుపతిరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గోళ్ల సింహాచలం, టీడీపీ నాయకులు దారపు డిల్లేశ్వరరావు, యాళ్ల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

టెక్కలి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న వసతిగృహాల్లో, ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని సాంఘిక సంక్షేమశాఖ, గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర ముఖ్యకార్యదర్శి ఎంఎం నాయక్‌కు జిల్లాకు చెందిన దళిత, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు రాజధానిలో శుక్రవారం కలిసి వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు వివిధ సంఘాల నాయకులు బోకర నారాయణరావు, కొచ్చ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

కొత్తమ్మతల్లి మూలధనం రూ.31.92 లక్షలు

కోటబొమ్మాళి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తమ్మతల్లి ఆలయంలో జరుగుతున్న నిత్య అన్నదానం ట్రస్టులో రూ.31,92,581 మూలధన నిధి ఉందని ఈవో వాకచర్ల రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు పేర్కొన్నారు. నిత్య అన్నదానం ట్రస్టులో 59 ఎఫ్‌డీఆర్‌లకు రూ.26,92,581 మూలధన నిధి ఉండగా ఇటీవల భక్తులు సమర్పించిన అన్నదాన విరాళాలు, మూలధన నిధిపై వచ్చిన వడ్డీలు కలిపి శుక్రవారం స్థానిక యూనియన్ బ్యాంకులో రూ.5 లక్షలు ఎఫ్‌డీఆర్ వేశామన్నారు. దీంతో మొత్తం అన్నదాన ట్రస్టులో రూ.31,92,581 మూల నిధి ఉందన్నారు. కాగా ఈనెల 28న కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో ఉదయం 10.30లకు ధర్మకర్తల మండలి సాధారణ సమావేశం నిర్వహించటం జరుగుతుందని సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న న్యాయాధికారి రోషిణి

పాతపట్నం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని పాతపట్నం జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి మానెం రోషిణి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ, పోలీసు అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహిం పలుసూచనలు చేశారు.

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పోలాకి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దీర్ఘాశి పంచాయతీ కింజరాపువానిపేట పాఠశాలకు మంజూరైన శాశ్వత భవనానికి శుక్రవారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శంకుస్థాపన చేశారు. రూ.29లక్షల వ్యయంతో నిర్మించనున్న పాఠశాల భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సమన్వయకర్త బగ్గు అర్చన, సర్పంచ్ మెండ సుమంగళి, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పోలాకి సహకారసొసైటీ ప్రాంగణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మా ట్లాడారు. కార్యక్రమంలో బగ్గు అర్చన, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణం నాయుడు, సొసైటీ అధ్యక్షుడు బైరి బాస్కరరావు, నాయకులు ఎంవీ నాయుడు పాల్గొన్నారు. అలాగే సంతలక్ష్మీపురంలో నిర్వహిం చిన క్లీన్ అండ్ గ్రీన్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అలాగే మబగాంలోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు.

దండాసి మృతి ఆదివాసీలకు తీరని లోటు

జలుమూరు (సారవకోట), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ఉద్యమ నేత జన్ని దండాసి మృతి ఆదివాసీలకు తీరని లోటని ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, జలుమూరు తహసీల్దార్ జన్ని రామారావు అన్నారు. నౌతల గ్రామంలో శుక్రవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు గేదెల శేషగిరిరావు, పడాల మాదయ్య, చిన్నబాబు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి


మందసలో పరిశీలిస్తున్న దృశ్యం

మందస/ హరిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని ఏపీ విద్యాసంక్షేమ వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ పీఎంజే బాబు అన్నారు. ఆర్‌కే పురం, మందస గురుకుల బాలికల పాఠశాలను పరిశీలించి, రూ.96లక్షలు నాబార్డు నిధులతో నిర్మించిన భవనాల ను పరిశీలించారు. అనంతరం జిల్లా కోఆర్డినేటర్ యశోధలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు సూచనలు అందజేశారు. కార్పొరేషన్ డీఈఇ శ్రీనివాస్, ఏఈ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

● నందిగాం: స్థానిక బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను శుక్రవారం సాయంత్రం గురుకులాల జిల్లా సమన్వయకర్త యశోధలక్ష్మి, ఏపీఈడబ్ల్యూఐడీసీ డైరెక్టర్ పీఎంజే బాబుతో కూడిన బృందం పరిశీలించింది. ప్రిన్సిపాల్ బి.మంజుల, అధ్యాపక బృందం తదితరులు ఉన్నారు.

ఆక్రమణను వ్యతిరేకించండి

మందస, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆస్తులను దేవుడి పేరుతో కాజేస్తున్న ఆక్రమణను వ్యతిరేకించాలని ఏపీ రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు అన్నారు. మందస శివాలయంలో శుక్రవారం ఇటీవల చినజీయరుస్వామి పంపిన కోర్టు నోటీసులకు వ్యతిరేకంగా మందస ప్రజలతో సమావేశం చేపట్టారు. 1981లో మందస రాజు వాసుదేవాలయం పక్కన తన ఆధీనంలో ఉన్న 1.40 సెంట్ల భూమిని కాలేజీ నిర్మాణానికి అందించారని, గ్రామస్థుల సహకారంతో కళాశాలను ప్రభుత్వం నిర్మించిందన్నారు. కొంతకాలంగా చినజీయరు స్వామి గోపాలసాగర్, శివాలయాన్ని ఆనుకొని ఉన్న భూములను ఆక్రమించి ప్రజలపై వాజ్యాలు వేస్తూ కోర్టుల చుట్టూ తిప్పడం సరికాదన్నారు. వేద పాఠశాల పేరుతో సంత స్థలాన్ని ఆక్రమణించి తమ సొంతానికి వాడుకుంటున్నారన్నారు. గిన్ని తిరుపతిరెడ్డి, కంచి బెహరా, దిలీప్‌కుమార్, గణేష్‌సాహు, వడ్డీ గోపాల్, కోదండరావు తదితనేలే పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయం పరిశీలన


పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

పలాస, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బొడ్డపాడు రెవిన్యూ పరిధిలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయం, కోసంగిపురం రోడ్డులో నిర్మించిన ఎన్టీయార్ గృహ సముదాయాన్ని మున్సిపల్ కమిషనర్ ఇ.శ్రీనివాసులు, డీఈఈ శ్రీహరి, ఏఈ రమణ, ఆర్ఐ అమర్‌తో కూడిన అధికారుల బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రహదారులు, కాలువలు, వీధి దీపాలు, తాగునీరు సమస్యలు ఇంకా పరిష్కారం కావాల్సి ఉందని,

వ్యవసాయ క్షేత్రం పరిశీలన

జలుమూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కొండపోలవలస గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావు సాగు చేసిన వరి చిరు సంచుల ప్రదర్శన క్షేత్రాన్ని రాగోలు వ్యవసాయ శాస్త్రవేత్తలు కె.మధుకుమార్, ఉదయబాబు, శ్రీనివాస్, జి.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. గత ఏడాది ఇచ్చిన ఆర్‌జీఎల్ 7034 రకం వరి విత్తనాలు మాజీ ఎమ్మెల్యే బగ్గు లక్ష్మణరావు ఈ ఏడాది 10 ఎకరాల్లో సాగు చేశారన్నారు. ఎకరాకు 34 బస్తాలు దిగుబడి వచ్చిందన్నారు.

ఎండలమల్లన్న ఆదాయం రూ.45లక్షలు

టెక్కలి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రావివలస ఎండల మల్లికార్జునస్వామి కార్తీక మాసంలో వివిధ రకాలుగా రూ.45,01,628 ఆదాయం వచ్చినట్టు ఈవో జి.గురునాథరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాలు నిర్వహించిన దినాల్లో శీఘ్రాభిషేకం టిక్కెట్ల ద్వారా రూ.11,61,440, శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా రూ.9,68,020, కేశఖండన టిక్కెట్ల ద్వారా రూ.65,320, హుండీల ద్వారా రూ.8,20,662, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.9,94,500, పులిహోరా ప్రసాదం విక్రయం ద్వారా రూ.4,90,670, ఇతర ఆదాయం రూ.1,016 వచ్చినట్టు తెలిపారు. గతేడాది రూ.30,30,042 ఆదాయం వచ్చిందన్నారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడి సూచనల మేరకు కార్తీక మాసోత్సవాలను వైభవంగా నిర్వహించామని, ఇందుకు సహకరించిన ఆర్డీవో ఎం.కృష్ణమూర్తితో పాటు అన్ని శాఖల ప్రతినిధులకు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

అపరాల సాగుతో మేలు

కోటబొమ్మాళి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో అపరాలు, వేరుశెనగ, మొక్కజొన్న పంటల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చునని టెక్కలి ఏడీఏ కె.జగన్మోహన్‌రావు అన్నారు. శుక్రవారం చిట్టివలస గ్రామంలో ఆత్మపథకంలో భాగంగా రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఆమదాలవలస కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.కిరణ్‌కుమార్, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వైసురేష్, ఏవో ఎస్.గోవిందరావు, వీఏఏలు రైతులు పాల్గొన్నారు.

శ్యామసుందర స్వామిని తాకిన సూర్యకిరణాలు


స్వామివారిని తాకిన సూర్యకిరణాలు

టెక్కలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక తొలుసూరుపల్లి రోడ్డులో దేవదాయశాఖ పరిధిలో గల శ్యామసుందరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారిని సూర్యకిరణాలు తాకాయి. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చినట్టు అర్చకులు రమేష్‌పండా తెలిపారు.

పరిశుభ్రతలో పోటీపడాలి

మెళియాపుట్టి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామం పరిశుభ్రతలో పోటీపడాలని డీఎల్‌డీవో అలివేలు మంగమ్మ తెలిపారు. శుక్రవారం నడసందర గ్రామంలో నిర్వహించిన హరితరాయిబారి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీడీవో ప్రసాద్ పండా, డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, టీడీపీ నాయకులు మోహనరావు, వెంకట్రావు, దినకరరావు, పరమేష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మోసం కేసులో మహిళ అరెస్టు

పాతపట్నం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక సహారవీధిలో నివాసం ఉంటున్న గంపు మణి అనే మహిళను మోసగించిన కేసులో అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశా రాష్ట్రం గుమ్మ బ్లాక్ లోని జొల్ల గ్రామానికి చెందిన జి.ప్రదీప్ అనేవ్యక్తి ద్వారా ముగ్గురు వ్యక్తులకు ఉద్యోగాలు వేయిస్తామంటూ స్థానిక సహారవీధిలో నివాసం ఉంటున్న అదే రాష్ట్రం ఉప్పలాడ గ్రామానికి చెందిన గంపు మణి రూ.4.50లక్షలు తీసుకొని వారికి నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్స్ ఇచ్చింది. ఆ తర్వాత వారు మోసపోయినట్టు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి గుంప మణిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు.

మినహాయింపు ఇవ్వాలి

నరసన్నపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): టెట్ పరీక్షలు నుంచి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం సంఘసభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు సబ్జెక్టు టీచర్లందరికి ఒకేచోట స్కూల్ కాంప్లెక్స్‌లు నిర్వహించడం సరికాదన్నారు. కార్యాక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బి.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి అచ్చెన్నరాక

టెక్కలి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం మధ్యాహ్నం 3 గంటలకు పాత జాతీయరహదారి పనులకు జగతిమెట్ట జంక్షన్ వద్ద శంకుస్థాపన, అలాగే అయ్యప్పనగర్‌లో నూతనంగా నిర్మించిన 40 అడుగుల రోడ్డును ప్రారంభించనున్నారని మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషగిరిరావు శుక్రవారం తెలిపారు. కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొనాలన్నారు.

బలోపేతానికి కృషి చేయాలి

హిరమండలం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. డిసెంబరు 31నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖలో నిర్వహించనున్న సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలన్నారు.

తీరంపై హక్కు కల్పించాలి


ఎం.సున్నాపల్లి తీరంలో పూజలు చేస్తున్న మత్స్యకారులు

సంతబొమ్మాళి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సముద్రతీరంపై మత్స్య కారులకు హక్కు కల్పించాలని ఫిష్‌కాన్ రాష్ట్ర అధ్యక్షుడు సూరాడ రాజారావు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎం.సున్నాపల్లి సముద్ర తీరంలో ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ముర్రాటలతో ఊరేగింపుగా సముద్రతీరానికి చేరుకుని గంగమ్మకు పూజలు చేశారు. నాయకులు మోహనరావు, నర్సింహమూర్తి, గోవర్ధన్ పాల్గొన్నారు.

● పాతపట్నం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకర ఆహారంలో చేపలకు ప్రత్యేకస్థానం ఉంటుందని హెచ్‌ఎం ఎస్.వైకుంఠరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయుడు ఎన్టీ రామారావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మత్స్యదినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు చేపల బజారును చూపి క్రయవిక్రయాలపై అవగాహన కల్పించారు.

● పోలాకి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మత్స్య దినోత్సవాన్ని శుక్రవారం గుప్పెడుపేట సాగరతీరంలో మత్స్యకారులు ఘనంగా నిర్వహించారు. గుప్పెడుపేట మత్స్యకార సొసైటీ సభ్యులు, సచివాలయ ఉద్యోగి ఢిల్లీశ్వరరావు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకులు లండ ఎర్రయ్య, పైడితాత, తులే పైడమ్మ, యువజన నాయకులు పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థ రూపుమాపాలి

జలుమూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దళారీ వ్యవస్థ రూపుమాపి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ సమన్వయ కర్త బగ్గు అర్చన అన్నారు. అల్లాడ సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. సీఈవో పి.గిరిధర్, సిబ్బంది పాల్గొన్నారు.

అంటువ్యాధుల నివారణకే..

ఎల్ఎన్ పేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అంటువ్యాధులను నివారించేందుకు పారిశుధ్యం పనులు చేపడుతున్నట్టు ఎంపీడీవో పి. శ్రీనివాసరావు తెలిపారు. చొర్లంగి గ్రామంలో క్లాప్‌మిత్ర (గ్రీన్ అంబాసిడార్స్)లో శుక్రవారం జరిగిన శిక్షణలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్‌అంబాసిడర్లు పాల్గొన్నారు.